పీవోపీ వద్దు.. మట్టి గణపతే ముద్దు

జల కాలుష్యానికి దారితీస్తున్న వైనం

మృత్యువాతపడుతున్న జలరాశులు

కలుషిత నీటితో అనేక వ్యాధుల బారిన మానవాళి

బొంరాస్‌పేట, చేవెళ్లటౌన్, సెప్టెంబర్ 2 : మరికొన్ని రోజుల్లో వినాయక చవితి పండుగను జరుపుకోబోతున్నాం. వినాయకచవితి పండుగ అంటేనే అందరికీ గుర్తుకు వచ్చేది గణపతి ప్రతిమలు. వాడవాడలా, ఊరూరా, ఇండ్లల్లో వినాయకులను ప్రతిష్ఠించి భక్తిశ్రద్ధలతో పూజలు చేస్తాం. అయితే ప్రకృతిని ఆరాధించే హిందూ ధర్మంలో సంప్రదాయానికి విరుద్ధంగా పర్యావరణానికి హాని కలిగేలా కొన్ని పనులు చేస్తున్నాం. మనం జరుపుకొనే కొన్ని ఉత్సవాలు శబ్ద, వాయు, జల కాలుష్యాలకు కారణమవుతున్నాయి. ఒకప్పుడు వినాయక చవితి పండుగను సాంప్రదాయంగా జరుపుకొనేవాళ్లం. ఇప్పుడు ఆకర్షణీయ రంగులతో వినాయకుడి విగ్రహాలను రూపొందిస్తూ వేడుకలు చేసుకుంటున్నాం. సంప్రదాయం ప్రకారం వినాయకుడి ప్రతిమను ప్రకృతిలో సహజసిద్ధంగా దొరికే మట్టితో తయారుచేసి పూలు, పత్రిలతో భక్తి శ్రద్ధలతో పూజించి.. ఆ తరువాత నీటిలో నిమజ్జనం చేసేవాళ్లం. అంటే ప్రకృతి నుంచి సేకరించిన మట్టితో తయారు చేసిన గణపతిని ఎలాంటి కృత్రిమ మార్పులు లేకుండా తిరిగి ప్రకృతిలో కలపటం జరిగేది.

మట్టి వినాయక విగ్రహాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పర్యావరణవేత్తలు(ఫైల్)

స్వాతంత్ర్య ఉద్యమ కాలంలో బ్రిటిష్‌వారికి వ్యతిరేకంగా భారత ప్రజలందరినీ ఒక తాటిపైకి తీసుకురావడానికి బాలగంగాధర తిలక్ మహారాష్ట్రలో వినాయక చవితి సందర్భంగా మట్టి విగ్రహాలతో నవరాత్రి పూజలను ప్రారంభించారు. కాలక్రమేణా మట్టి విగ్రహాల స్థానంలోకి రసాయనిక పదార్థాలతో కూడిన విగ్రహాలు వచ్చి చేరాయి. ఎంత పెద్ద విగ్రహాలు పెడితే అంత గొప్ప అనే సంస్కృతి పెరిగిపోయింది. రంగుల వినాయకులను తయారు చేయడానికి, వాటిని తీర్చిదిద్దడానికి ప్లాస్టర్ ఆఫ్ పారిస్, ఇనుము, పాదరసం, క్రోమియం, సీసం, కడియం, లెడ్, ఆర్సినిక్ వంటి విషపూరిత రసాయనాలను వినియోగిస్తున్నారు. ఈ విగ్రహాల నిమజ్జనంతో జలరాశులు మృత్యువాతపడుతున్నాయి. పశువులు అనారోగ్యంపాలవుతున్నాయి. అదేనీటితో పండిన ఆహారం తీసుకోవడం వల్ల మూత్రపిండాలు, కాన్సర్, జీర్ణకోశ, చర్మ, కాలేయ సంబంధిత వ్యాధులు వచ్చే అవకాశం ఉన్నది. విగ్రహాల నిమజ్జనం సమయంలో పూడిక చేరి జలాశయాలు నీటి నిల్వ సామర్థ్యాన్ని కోల్పోతున్నాయి. ప్రతి సంవత్సరం రంగులతో చేసిన వినాయకుల నిమజ్జనం కారణంగా 10వేల టన్నుల రసాయన వ్యర్థాలు భూమిలో చేరుతున్నాయి. భూమిలో ఉన్న 71 శాతం జలరాశిలో 68 శాతం సముద్ర జలాలే.. 2 శాతం మంచుతో కప్పబడి ఉన్నది. మిగిలిన ఒక శాతం నీటినే తాగడానికి, కాలకృత్యాలకు, వ్యవసాయానికి, భూమిపై ఉన్న సమస్త జీవరాశి అవసరాలకు, పరిశ్రమలకు వాడబడుతున్నది. మిగిలిన ఈ ఒక్క శాతం నీటిని కూడా మనం కలుషితం చేస్తే మన వేలితో మన కంటిని పొడుచుకున్నట్లే, కర్రలు, వరిగడ్డి, మట్టితో సులభంగా నీటిలో కరిగిపోయేలా తయారు చేసిన మట్టి వినాయకులను ప్రతిష్ఠించి పర్యావరణాన్ని కాపాడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఉమ్మడి రంగారెడ్డి జిల్లావ్యాప్తంగా ప్రతి సంవత్సరం వేల సంఖ్యలో గణనాథులను ప్రతిష్ఠిస్తారు. మట్టి వినాయకుల ప్రతిష్ఠాపనపై ఏటేటా ప్రజల్లో చైతన్యం తీసుకువస్తున్నా పీవోపీ విగ్రహాలను ప్రతిష్ఠించడం తగ్గలేదు. నిర్వాహకులు ముఖ్యంగా యువత మట్టి వినాయకులను ప్రతిష్ఠించడంపై దృష్టి సారించాలి. వికారాబాద్ జిల్లాలోని కులకచర్ల, ధారూరు మండలాల్లో మట్టి వినాయకులను తయారు చేసి అమ్ముతుంటారు. బొంరాస్‌పేటలోని భూలక్ష్మీ ఆలయం చౌరస్తాలో పదేండ్ల నుంచి మట్టి గణపతిని ప్రతిష్ఠించి యువత ఆదర్శంగా నిలుస్తున్నారు. మట్టి వినాయకులనే పూజించాలన్న సంకల్పంతో కోస్గి పట్టణానికి చెందిన గందె ఓం ప్రకాశ్ మట్టి గణనాథులను గ్రామాల్లో పంపిణీ చేస్తుంటాడు. అందరిలో చైతన్యం వస్తేనే మార్పు అనేది ప్రారంభమవుతుంది.

ప్రజల్లో మార్పు వస్తున్నది

19 ఏండ్లుగా పర్యావరణ పరిరక్షణపై చేస్తున్న పోరాటంతో ప్రజల్లో క్రమంగా మార్పు వస్తున్నది. ప్రతి సంవత్సరం సమావేశాలు ఏర్పాటు చేసి అవగాహన కల్పిస్తున్నాం. ఇప్పుడు స్వచ్ఛందంగా మట్టి వినాయకులను ప్రతిష్ఠించేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. వంద విగ్రహాలతో మొదలుపెట్టి ఇప్పుడు వెయ్యికి పైగా విగ్రహాలను పంపిణీ చేస్తున్నా.

- రామకృష్ణారావు, పర్యావరణ అవార్డు గ్రహీత

పీవోపీ విగ్రహాలతో పర్యావరణ కాలుష్యం

రానురాను మట్టి గణపతులను మర్చిపోయాం. ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసిన గణనాథులను ప్రతిష్ఠిస్తూ పర్యావరణ కాలుష్యానికి కారణమవుతున్నాం. కృత్రిమ రసాయన పదార్థాలతో తయారుచేసిన పీవోపీ గణపతి విగ్రహాలు జల కాలుష్యానికి దారి తీస్తాయి. ఈ విగ్రహాలను నీటిలో నిమజ్జనం చేసినప్పుడు మంచినీరు ఉప్పు నీరుగా మారుతుంది. ప్రకృతి మనకు ప్రసాదించిన మంచినీటి వ్యవస్థను సమాజం కోల్పోవలసి వస్తున్నది. విగ్రహాల తయారీలో వాడుతున్న రసాయనాలు, రంగులతో నిమజ్జనం చేసిన చెరువు లేదా జల వనరు రంగు కలుషితమవుతున్నది. ఆ నీరు పంట పొలాల్లో సేద్యపు నీటిగా వాడడం వలన సారవంతమైన పంట భూమిని నిర్జీవంగా మారుస్తుంది. నీటిలో పెరిగే అపారమైన వృక్ష, మత్స్య, జంతు సంపద నశిస్తుంది. నీటిలో కరిగి ఉన్న ఆక్సిజన్ పరిమాణం తగ్గిపోతుంది. మట్టితో తయారు చేసిన వినాయకుడి విగ్రహం 45 నిమిషాల్లో నీటిలో కరిగిపోతుంది, కానీ పీవోపీతో తయారుచేసిన విగ్రహం నీటిలో కరగకుండా కొన్ని నెలలపాటు ఉండిపోతుందని తేలింది. మట్టి గణపతి నీటిలో కరిగిపోతుంది కాబట్టి అదే మట్టిని ఉపయోగించి మరుసటి సంవత్సరం కొత్త విగ్రహాలను తయారు చేసుకోవచ్చు. మట్టి వినాయకుడిని పూజించడం ద్వారా రీసైక్లింగ్ అనే ప్రకృతి విధానాన్ని మనం పాటించవచ్చు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ నిర్జీవంగా మార్చే ఒక విష పదార్థం. మనిషి జీవితం డబ్బు, ఆర్భాటాలతో ముడిపడిలేదు. గాలి, నీటితోనే ముడిపడి ఉన్నది. కాబట్టి భగవంతుడు మనకు వరంగా ప్రసాదించిన గాలిని, నీటిని, మట్టిని కాపాడుకుందాం. మట్టి గణపతులను పూజిద్దాం.

ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్

వికారాబాద్, సెప్టెంబర్ 2 : ప్రజావాణి కార్యక్రమం ద్వారా వచ్చిన ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించాలని వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశం హాలులో నిర్వహించిన ప్రజావాణికి వివిధ సమస్యలపై 71 ఫిర్యాదులు వచ్చాయి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజావాణి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో 71 అర్జీలు రాగా భూ సమస్యలు 59, పింఛన్లు 2, ఇతరములు 10 వచ్చాయని కలెక్టర్ తెలిపారు. సంబంధిత శాఖల అధికారులు అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, ఆర్‌డీవో వాసుచంద్ర, జిల్లా అధికారులున్నారు.



డీఈవో సుశీందర్‌రావుకు వినతిపత్రం అందజేస్తున్న పీఆర్‌టీయూ నాయకులు

జూలై నెల వేతనాలు ఇప్పించండి

- **వర్క్ అడ్జెస్ట్‌మెంట్ చేపట్టి ఉపాధ్యాయుల కొరతను తీర్చాలి**
- **డీఈవోకు టీఎస్ పీఆర్టీయూ యూనియన్ వినతి**

రంగారెడ్డి, సెప్టెంబర్ 2 (నమస్తే తెలంగాణ) : జూలై నెలలో బదిలీలు, ప్రమోషన్స్ పొందిన ఉపాధ్యాయులకు వేతనాలు రాలేదని, వెంటనే విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలని టీఎస్ పీఆర్టీయూ రంగారెడ్డి జిల్లా యూనియన్ విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు జిల్లా విద్యాశాఖధికారి కార్యాలయంలో డీఈవో సుశీందర్‌రావుకు సోమవారం యూనియన్ జిల్లా అధ్యక్షుడు కేశవులు, ప్రధాన కార్యదర్శి రాజిరెడ్డి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వేతనాలు రాక ఉపాధ్యాయులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ తర్వాత జిల్లాలో చాలా పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత ఏర్పడి బోధనకు ఇబ్బందులు కలుగుతున్నాయని పేర్కొన్నారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులను వర్క్ అడ్జెస్ట్‌మెంట్ చేయాలని కోరారు.

భద్రత, బందోబస్తు కోసమే..

- **గణేశ్ మండపాల నిర్వాహకులు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలి**
- **వికారాబాద్ ఎస్పీ నారాయణరెడ్డి**

వికారాబాద్, సెప్టెంబర్ 2 : గణేశ్ మండపాల నిర్వాహకులు పోలీసు శాఖ వారు రూపొందించిన పోర్టల్ ద్వారా వివరాలను నమోదు చేసుకుని పోలీసు వారికి సహకరించాలని వికారాబాద్ ఎస్పీ నారాయణరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోలీసు శాఖ వారు రూపొందించిన ఆన్‌లైన్ అప్లికేషన్ అనేది కేవలం మండపం నిర్వహణ, మండపాలకు సంబంధించిన సమాచారం కోసం మాత్రమే రూపొందించిందన్నారు. ఈ సమాచారం ద్వారా భద్రత, బందోబస్తు ఏర్పాటు చేయడానికి పోలీసు అధికారులకు సులువుగా ఉంటుందని తెలిపారు. ఆన్‌లైన్ ఇన్ఫర్మేషన్‌కు ఎటువంటి రుసుము లేదని, గణేశ్ ఉత్సవాల నిర్వాహకులు గణేశ్ విగ్రహాల ఏర్పాటు సమాచారం ఆన్‌లైన్‌లో పొందుపరిచి పోలీసుస్టేషన్లలో సమాచారం ఇవ్వాలన్నారు. అందుకోసం తమ తమ కంప్యూటర్‌లు, మొబైల్‌ఫోన్స్ ద్వారా https://policeportal.tspolice.gov.in/index.htmలో అప్లై చేసుకోవాలన్నారు. మండపం ఏర్పాటు చేసే సమయంలో షార్ట్ సర్క్యూట్ జరుగకుండా మంచి నాణ్యత గల వైరును ఉపయోగించి పలు జాగ్రతలు పాటించాలన్నారు. నిర్వాహకులు మండపాల కమిటీ వివరాలు, మండపాల బాధ్యత వహించేవారి వివరాలు, ఫోన్ నంబర్లను మండపంలో ఏర్పాటు చేయాలన్నారు. తమ పరిధిలోని పోలీస్ అధికారుల ఫోన్ నెంబర్ లు కలిగి ఉండాలని, మండపాల్లో ఎట్టిపరిస్థితులోనూ డిజేలను ఏర్పాటు చేయరాదన్నారు. గణేశ్ ప్రతిమలు కూర్చుండబెట్టే ప్రదేశంలో ఎలాంటి ప్రమాదాలు జరగకుండా షెడ్ నిర్మాణంలో మంచి నాణ్యత గల షెడ్ ఏర్పాటు చేయవాలని సూచించారు. 24 గంటలు వలంటీర్లు ఉండేలా నిర్వహకులు తగు చర్యలు తీసుకోవాలని, భక్తుల సందర్శనను దృష్టిలో ఉంచుకొని క్యూలైన్లను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. మండపాల వద్ద ఎలాంటి అగ్నిప్రమాదాలు జరుగకుండా ముందు జాగ్రత చర్యలు చేపట్టాలని, పాయింట్ పుస్తకం ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. పోలీసు అధికారులు తనిఖీకి వచ్చినప్పుడు అందులో రాసి సంతకం చేస్తారని, మండపాల్లో ఏదైనా అనుమానాస్పదంగా బ్యాగులు, ప్లాస్టిక్ సంచులు, వస్తువులు, వ్యక్తులు కనిపించినట్లయితే తక్షణమే డయల్ 100గాని లేదా స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు. సామాజిక మాధ్యమాల్లో వచ్చే ఎలాంటి రూమర్స్, వదంతులను నమ్మకూడదని, ఎవరికైనా ఎలాంటి సందేహాలున్నా సంబంధిత పోలీసు వారికి లేదా 100కు కానీ జిల్లా పోలీస్ కంట్రోల్ రూమ్ నంబర్ 8712670056కు సమాచారం అందించాలని సూచించారు.

ఆమనగల్లు ప్రభుత్వ దవాఖానలో మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వర్లు

సీజనల్ వ్యాధులపట్ల అప్రమత్తంగా ఉండాలి

- **ప్రభుత్వ దవాఖానల్లోనే నిరంతర మెరుగైన వైద్య సేవలు**
- **జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వర్లు**

ఆమనగల్లు, సెప్టెంబర్ 2 : ప్రస్తుతం ప్రబలుతున్న సీజనల్ వ్యాధులతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, సీజనల్‌గా వచ్చే జ్వరాలన్నీ డెంగీ జ్వరాలు కాదని జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఆమనగల్లులోని తాత్కాలిక దవాఖానను సోమవారం డిప్యూటీ డీఎంఎచ్‌వో గీతతో కలిసి జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వర్లు పరిశీలించారు. ఈ సందర్భంగా రోగులతో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. జ్వరం వస్తే తక్షణమే స్థానిక ప్రభుత్వ దవాఖానలకు వెళ్లి చికిత్స చేసుకోవాలని సూచించారు. ఎక్కువ రోజులు జ్వరముంటే ప్లేట్‌లేట్స్ తగ్గే అవకాశం ఉందని, నిర్లక్యం చేయకుండా వైద్యం చేయించుకోవాలని ఆయన తెలిపారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రతినిత్యం ఆమనగల్లు దవాఖానకు 300 మంది ఓపీ సేవలు కొనసాగుతున్నాయాని ఆయన వివరించారు. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో ప్రస్తుతం నిర్మిస్తున్న దవాఖానాను పది నెలల్లో పూర్తి చేసి అందుబాటులోకి తెస్తామన్నారు. ప్రభుత్వ దవాఖానల్లోనే మెరుగైన వైద్య సేవలు అందుతాయని.. ప్రజలెవ్వరూ వ్యాధుల పట్ల భయపడవద్దని.. అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయని ఆయన తెలిపారు. విధుల పట్ల డాక్టర్లు, వైద్య సిబ్బంది నిర్లక్యం వహిస్తే శాఖాపరంగా చర్యలు తప్పవన్నారు. అనంతరం దవాఖార రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో వైద్యులు పరీక్షిత్ నరేందర్, నాగరాజు, మైమునా బేగం, హెడ్ నర్సు ఏసుమణి, నర్సింగ్ అఫీసర్ ఏక్సీబా, ఫార్మసిస్ట్ ఇందిర, ఎంపీహెచ్‌ఈవో తిరుపతిరెడ్డి, సిబ్బంది ఉన్నారు

మేడిగడ్డ తండాలో అలుగు పారుతున్న కత్వావాగు



ఆమనగల్లు మండలంలో గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు కొన్ని చెరువులు నిండుకుండలా జలకళ ను సంతరించుకున్నాయి.

ఆమనగల్లులో నిండుకుండలా సురసముద్రం చెరువు

'అనంత' అందాలు

ఊటీని తలపిస్తున్న అనంతగిరి కొండలు

వికారాబాద్, సెప్టెంబర్ 2 : గత మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు అనంతగిరి కొండలపై వరద నీరు జాలువారుతున్నది. పచ్చని ప్రకృతి అందాల మధ్య కొండలు పర్యాటకులను కనువిందు చేస్తున్నాయి. పర్యాటకులు కొండలపై ట్రెక్కింగ్ చేశారు. అనంతగిరిలో చల్లని వాతావరణం చిన్నపాటి ఊటీని తలపిస్తున్నదని పలువురు పర్యాటకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సోమవారం సెలవు దినం కావడంతో అనంతగిరిలో వాటర్ ఫాల్స్ చూసేందుకు పర్యాటకులు తరలివచ్చారు. కొండలపై జాలువారుతున్న నీటిని చూసి ఆనందంతో మురిసిపోయారు. ఫోన్‌లలో సెల్ఫీలు, ఫొటోలు దిగేందుకు పర్యాటకులు ప్రాధాన్యత ఇచ్చారు. అదే విధంగా శ్రావణ మాసం చివరి సోమవారం కావడంతో అనంతపద్మనాభస్వామివారిని భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు.

కాంగ్రెస్ హయాంలో వికలాంగులకు రక్షణ కరువైంది

వికారాబాద్, సెప్టెంబర్ 2 : కాంగ్రెస్ ప్రభుత్వంలో వికలాంగులకు రక్షణ కరువైందని వికలాంగుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు కాళ్ల జంగయ్య అన్నారు. సోమవారం వికారాబాద్ జిల్లా కేంద్రంలోని గెస్ట్‌హౌస్ లో వికలాంగుల హక్కుల పోరాట సమితి (వీహెచ్‌పీఎస్) వికారాబాద్ జిల్లా ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వికలాంగుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు కాళ్ల జంగయ్య మాట్లాడుతూ వికలాంగులకు తెలంగాణ రాష్ట్రంలో రక్షణ లేకుండా పోయిందని, మొన్నటికి మొన్న ఐఏఎస్ అధికారి స్మితా సబర్వాల్ వికలాంగులను అవహేళన చేస్తే ప్రభుత్వం ఆమెపై ఎటువంటి చర్య తీసుకోలేదని మండిపడ్డారు. ఆమె మీద చర్యలు తీసుకోవాలని వికలాంగుల సంఘాలు రోడ్లపైకి వచ్చి ధర్నాలు దీక్షలు చేస్తే ప్రభుత్వానికి చీమకుట్టినట్టు కూడా కాలేదని వాపోయారు. ప్రభుత్వమే వెనకేసుకొస్తుందనే అనుమానం వ్యక్తం అవుతుందన్నారు. హైదరాబాద్ నడిబొడ్డున మలక్‌పేటలో గల అంధ విద్యార్థిపై అత్యాచారం జరిగితే ఇప్పటివరకు బాధితురాలికి అసలు అత్యాచారమే జరగనట్టు మంత్రి సీతక్క మాట్లాడడం వెనుక వికలాంగులపై ఎంత ప్రేమ ఉందో అర్థమవుతుందన్నారు. హైదరాబాదులో హైడ్రా పేరుతో పెద్ద ఎత్తున ఇళ్లు కూల్చివేత కార్యక్రమాన్ని ప్రభుత్వం తీసుకోవడం జరిగిందని, ఈ విషయంలో గత 20 సంవత్సరాల క్రింద, ఇండ్ల స్థలాలు ప్రభుత్వమే ఇచ్చిన సంగతి మర్చిపోయిందని విమర్శించారు. అదే క్రమంలో వికలాంగులకు ,వృద్ధులకు వితంతులకు ఒంటరి మహిళలకు బీడీ కార్మికులకు చేనేత కార్మికులకు కల్లుగీత కార్మికులకు పెన్షన్లు పెంచుతామని చెప్పి, 9 నెలలు గడుస్తున్న ఇప్పటివరకు పెన్షన్ల ఊసే ఎత్తని రేవంత్ రెడ్డి సర్కార్ తక్షణమే గద్దె దిగాలని డిమాండ్ చేశారు. వికలాంగుల సమస్యల మీద దృష్టి పెట్టి పరిష్కారమయ్యే విధంగా కృషి చేయాలని సూచించారు.. లేకుంటే మందకృష్ణ మాదిగ నాయకత్వంలో పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వీహెచ్పీఎస్ జిల్లా అధ్యక్షులు శాంప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి పులిమతి రాజు, రాష్ట్ర నాయకులు



సమావేశంలో మాట్లాడుతున్న వీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు కాళ్ల జంగయ్య

విజయ్ కుమార్, జిల్లా నాయకులు ఆకుల సంజీవ తదితరులు పాల్గొన్నారు.